క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పొదలకూరు : స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) కోర్సుల్లో 2023–24 విద్యాసంవత్సరానికి ఐదో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.మురళీధర్ మంగళవారం తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ఈనెల 7వ తేదీలోగా అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించాల్సిందిగా సూచించారు. సివింగ్ టెక్నాలజీ, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, హార్టికల్చర్ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఎలాంటి కాల్‌లెటర్స్ పంపమన్నారు. అభ్యర్థులు ఈనెల 8వ తేదీన సాయంత్రం 5 గంటల్లోగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఐదోవిడత కౌన్సిలింగ్ పొదలకూరుకు సమీపంలోని చిట్టేపల్లి వద్ద ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు నూతన ఐటీఐ కళాశాల భవనంలో నిర్వహిస్తామని చెప్పారు. పైన తెలిపిన కోర్సుల వివరాలకు సంబంధించి సివింగ్ టెక్నాలజీ 81850 88996, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ 89851 19940, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ 94948 31200, హార్టికల్చర్ 88868 86144 నంబర్లకు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

పొదలకూరు : జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సీపీఎం ఈనెల 6వ తేదీ నుంచి తలపెట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు కె.పెంచలనరసయ్య తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని విరువూరు గ్రామం నుంచి పాదయాత్రను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. పాదయాత్రను పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ ప్రారంభిస్తారన్నారు. ఈనెల 13న నెల్లూరు నర్తకి సెంటర్‌లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బి.మనోహర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో ఏబీవీపీ నిరసన

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ వీఎస్‌యూ పరిధిలోని డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఇన్‌స్టెంట్ పరీక్షలు నిర్వహించేందుకు వీఎస్‌యూ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు రాసిన విద్యార్థులు రెండు నెలల నుంచి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారని, ఫలితాలు విడుదల చేయకుండా ఇన్‌స్టెంట్ పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. ఈ పరీక్ష ఫలితాలు విడుదల చేసిన తరువాతే ఇన్‌స్టెంట్ పరీక్షలు జరపాలని డిమాండ్ చేశారు.

పదోన్నతి పొందిన సెక్రటరీకి సన్మానం

పొదలకూరు : నాలుగేళ్లుగా పొదలకూరు పంచాయతీ గ్రేడ్–1 సెక్రటరీగా పనిచేస్తూ పదోన్నతిపై ఈఓపీఆర్డీగా వెళ్తున్న ఎస్కే అల్లాభక్షును స్థానిక సచివాలయం బిట్–1 వద్ద పాలకమండలి సభ్యులు మంగళవారం సన్మానించారు. ముందుగా పంచాయతీ గ్రామసభను సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం సెక్రటరీ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్ల పాటు వివాద రహితుడిగా సేవలు అందించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సోమా అరుణ, ఎంపీటీసీ సభ్యులు జి.లక్ష్మీల్యాణి, జి.శ్రీనివాసులు, వార్డుసభ్యులు ఎస్కే అంజాద్, కె.వాసుదేవరావు, హేమంత్, ప్రసాద్, మూలి సతీష్‌రెడ్డి, భాస్కర్, హరి, విజయలక్ష్మి, మూర్తిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు దస్తగిరి, లక్కాకుల ఆనంద్‌రావు, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్కే ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ఓరియెంటేషన్ ప్రోగ్రామ్



ముత్తుకూరు : ముత్తుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో జిల్లాలోని 8 గురుకుల పాఠశాలలకు సంబంధించి బోధన, బోధనేతర సిబ్బందికి ఓరియెంటేషన్ ప్రోగ్రాం మంగళవారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా జిల్లా సమన్వయకర్త టి.హేమలత ఆధ్వర్యంలో జూనియర్ లెక్చరర్లు, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లకు వారి సబ్జెక్టులకు సంబంధించి అవగాహన సమావేశాలు జరిపారు. నెల్లూరు కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయులు జోషీబాబు, అలివేలు మంగాబాయి తదితరులు సీబీఎస్‌ఈపై అవగాహన కల్పించారు. బుధవారం కూడా అవగాహన కార్యక్రమం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపల్ సుజాత తెలిపారు.

పక్కాగా ఓటర్ల జాబితా

- కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని పక్కాగా చేపడుతున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణపై జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో వారాంతపు సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో కమిషనర్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటింటి సర్వేలో గుర్తించిన, పెండింగ్‌లో ఉన్న అన్ని ఓటరు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి అన్ని చర్యలు చేపడుతున్నామని వివరించారు. రేషనలైజేషన్ ప్రక్రియపై సూచనలివ్వాలని కోరారు.



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

బీవీనగర్‌లో 'జగనన్న ఆరోగ్య సురక్ష'



మాట్లాడుతున్న రంగారెడ్డి

నెల్లూరు రూరల్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి కోరారు. 22వ డివిజన్ బీవీనగర్‌లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్ వికాస్ మర్మత్ హాజరయ్యారు. కార్పొరేటర్లు విజయభాస్కర్‌రెడ్డి, గౌరి, శ్రీనివాసులురెడ్డి, నేతలు హరిబాబుయాదవ్, ఏసునాయుడు, సురేష్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్ల పాత్ర కీలకం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సచివాలయ వ్యవస్థ ద్వారా విద్యుత్ సంస్థలో ఎనర్జీ అసిస్టెంట్లుగా చేరిన జేఎల్‌ఎం గ్రేడ్ – 2 ఉద్యోగులు కీలకపాత్రను పోషిస్తున్నారని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ పేర్కొన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లుగా విధుల్లో చేరి నాలుగేళ్లు పూర్తయిన నేపథ్యంలో నగరంలోని విద్యుత్ భవన్ వద్ద ఎస్‌ఈ చేతుల మీదుగా కేక్‌ను మంగళవారం కట్ చేయించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌ఈ మాట్లాడారు. ఎనర్జీ అసిస్టెంట్లుగా ఉద్యోగావకాశాన్ని కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. అనంతరం వివిధ సమస్యలపై ఎస్‌ఈకి వినతిపత్రాన్ని యూఈఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు అందజేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాకీర్‌హుస్సేన్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ పెంచలప్రసాద్, హజరత్తయ్య, జిల్లా నేతలు విజయరామిరెడ్డి, నాగయ్య, హరినారాయణ, కృష్ణ, సుమన్, రసూల్, సునీల్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయన్

పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయం



మాట్లాడుతున్న విడవలూరు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు (టౌన్): భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయమని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు పోరాట జీవిత కథ పుస్తక పరిచయ కార్యక్రమాన్ని నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పొట్టి శ్రీరాములు స్మారక స్థూపాన్ని నెల్లూరులో ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య మాట్లాడారు. పత్రిక, రేడియో, టెలివిజన్ రంగాల్లో తన రచనలు, ప్రసంగాలతో ప్రత్యేకతను సంతరించుకున్న నాగసాయిసూరి అమరజీవి జీవితానికి సంబంధించిన అనేక గ్రంథాలను శోధించి పుస్తక రూపంలో అందించడం హర్షణీయమన్నారు. ప్రిన్సిపల్, ఆర్ఐఓ శ్రీనివాసులు, డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గిరి, విశ్రాంత వయోజన విద్య సహాయ సంచాలకుడు మాల్యాద్రి, సాహితీవేత్త రంగారావు, సావిత్రి, గిరిజ, వేదం సూర్యప్రకాశం, అధ్యాపకులు కరుణశ్రీ, రవీంద్రనాథ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి సంపూర్ణ భరోసా



నెల్లూరు రూరల్: ప్రజారోగ్యానికి ప్రభుత్వం సంపూర్ణ భరోసాను కల్పిస్తోందని నెల్లూరు రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మాదరాజుగూడూరులోని గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. అనంతరం పలువురికి వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, సర్పంచ్ వెంకటేశ్వర్లు, అల్లీపురం పీహెచ్‌సీ వైద్యులు హజరత్‌రెడ్డి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



తోటపల్లిగూడూరు : గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగుతోందని ఎంపీపీ ఉప్పల స్వర్ణలత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ క్రమంలో తాగునీరు, పారిశుద్ధ్యం, గృహనిర్మాణాల పురోగతి, ఉపాధిహామీ పథకం పనులపై అధికారులు చర్చించారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష, 'గడప గడపకు మన ప్రభుత్వం' ద్వారా పరిష్కారమవుతున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్వర్ణలత మాట్లాడుతూ మండలాధికారులతో పాటు గ్రామస్థాయి అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ హేమలత మాట్లాడుతూ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో మండలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, మండల ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, కంజి నీలమ్మ, ఎంపీడీఓ హేమలత, తహసీల్దార్ లావణ్య, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు రాయపు శీనయ్య, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.2.57 లక్షలు పలికిన గణేశ్ లడ్డూ



మనుబోలు : మనుబోలు మండల కేంద్రంలో వినాయక చవితి సందర్భంగా భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్య విగ్రహానికి సోమవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు. గణనాథునికి నైవేద్యంగా ఉంచిన లడ్డూను వేలం వేయగా రికార్డు స్థాయిలో రూ.2.57 లక్షలకు కుడితిపల్లి గ్రామానికి చెందిన గుండుబోయిన వెంకయ్య దక్కించుకున్నారు. అలాగే వినాయకుని మెడలో అలంకరించిన నగదు మాలను రూ.2.47 లక్షలకు కొండూరుసత్రానికి చెందిన దావులూరు చెన్నకేశవులు దక్కించుకున్నారు. వినాయకుని ప్రతిమ కలిగిన వెండి కాయిన్‌ను రూ.35 వేలకు మనుబోలుకు చెందిన నీలిశెట్టి సుమతి దక్కించుకున్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



కొడవలూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. మండలంలోని గౌతమ్ నగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ పథకం ప్రవేశపెట్టినా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు దేశంలోనే ఎక్కడా లేవన్నారు. అనంతరం నిర్వహించిన శిబిరంలో ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు మనీష్, ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు రాజశేఖర్, పీహెచ్‌సీ వైద్యులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు రోగులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంఈఓ జి.వసంతకుమారి, ఎంపీపీ గాలి జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సర్పంచ్ నాగిరెడ్డి సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి షబ్బీర్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(బారకాసు): సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎడిబుల్ ఆయిల్ ట్రేడ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. పలువురు వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎంకు ఆయన తెలియజేశారు.



బాల్య వివాహాల నివారణకు సమష్టి కృషి

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలో బాల్య వివాహాల నివారణకు సమష్టిగా కృషి చేస్తున్నామని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనా సుజన్ పేర్కొన్నారు. బాల్యవివాహాల నివారణ చర్యల్లో భాగంగా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని పోలీస్ కాలనీలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నాయని గుర్తిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు ఫిర్యాదు చేయాలని కోరారు. అనంతరం కార్యాచరణ ప్రణాళిక ప్రతులను పలువురికి అందజేశారు. జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి శ్రీనివాసరావు, మునెమ్మ, మనోజ్, నాగమణి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కార్యాచరణ ప్రణాళిక ప్రతులను అందజేస్తున్న హేనాసుజన్

వృద్ధులను ఆదరించడం బాధ్యత



మాట్లాడుతున్న వాణి



హాజరైన వృద్ధులు తదితరులు

నెల్లూరు(వేదాయపాళెం): వృద్ధులను ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. జిల్లాలో ఎక్కువ మంది వృద్ధులు వృద్ధాశ్రమాల్లో ఉండటం బాధాకరమని చెప్పారు. వృద్ధులకు ఏ సమస్యొచ్చినా, వారికి అవసరమైన సహాయ, సహకారాలను అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు అక్బర్ అలీ, ప్రభుత్వోద్యోగుల సంఘ జనరల్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, ఓల్డేజ్ హోమ్ అసోసియేషన్ అధ్యక్షులు రవూఫ్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను దేవస్థాన ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, సభ్యులు దొరబాబు, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.



చెరువులో ఆక్రమణల తొలగింపు

నెల్లూరు రూరల్: కల్లూరుపల్లి పెద్ద చెరువులో కొందరు ఇటీవల ఆక్రమణలకు పాల్పడిన అంశమై రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు రైతులు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలతో చెరువు విస్తీర్ణం తగ్గుముఖం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో చెరువు వద్దకు ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది మంగళవారం చేరుకొని ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవనే హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.



చెరువులో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

హామీలను అమలు చేయాలని డిమాండ్

నెల్లూరు (దర్గామిట్ట): పంటకు మద్దతు ధరను అందించేలా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కిసాన్ మోర్చా, జిల్లా కార్మిక సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు కలెక్టరేట్ వద్ద ధర్నాను మంగళవారం చేపట్టారు. అనంతరం జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. చిరసాని కోటిరెడ్డి, చంద్ర రాజగోపాల్, షానవాజ్, రమణయ్య, సునీత, లక్ష్మీరెడ్డి, చంద్రమౌళి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ వాకర్స్‌కు సత్కారం



నెల్లూరు రూరల్: నగరంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు నారాయణసింగ్, కల్యాణిబాయ్ దంపతులు, ఎమ్మార్ నాయుడ్ని మంగళవారం సత్కరించారు. వీరికి మహాత్మాగాంధీ ఫెలోషిప్‌ను ప్రదానం చేశారు. అంతర్జాతీయ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు నేతాజీ సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బలరామనాయుడు, రాఘవరెడ్డి, శ్రీమన్నారాయణ, జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి, ఖాజామస్తాన్, చెంచయ్య, హరిసుధ, ప్రసాద్, రాజగోపాల్, కృష్ణయ్య పాల్గొన్నారు.